సాక్షి నిజామాబాద్

సోమవారం, 18, మార్చి, 2024



బ్యాంకులు, ఏటీఎంలే టార్గెట్

దొంగలు జిల్లాలోని బ్యాంకులు, ఏటీఎంలను టార్గెట్ చేసి చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవలి కాలంలో ఘటనలు పెరిగాయి.

- 8లో ▸



గరిష్టం/కనిష్టం

36.5 /21.3

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత కొనసాగవచ్చు.

న్యూస్‌రీల్

మీడియా సెంటర్ ప్రారంభం

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో కలెక్టరేట్‌లోని రూంనెం. 28లో మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్(ఎంసీఎంసీ)ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్ ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సూచించారు. సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ప్రచురణ, ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలను ప్రసారం చేయడం, అభ్యర్థి ప్రచార వ్యయంలో వాటిని లెక్కించడం, సోషల్ మీడియాలో అభ్యర్థులు రాజకీయ పార్టీల ప్రకటనలు వంటి వాటిని సకాలంలో ఆమోదిస్తూ, మంజూరు చేయాలని సూచించారు. పత్రికలు, చానెల్స్‌లో వచ్చే వార్తలు రికార్డు చేయాలన్నారు. సోషల్ మీడియాలో పోస్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టంచేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రెయినీ ఐఏఎస్ కిరణ్మయి, ట్రెయినీ ఐపీఎస్ చైతన్యరెడ్డి పాల్గొన్నారు.

నవజాత శిశువు సంరక్షణపై అవగాహన సదస్సు



నిజామాబాద్‌నాగారం: నవజాత శిశువు సంరక్షణపై నేషనల్ నియోనెటాలజీ ఫోరం తెలంగాణ, భారతీయ పిల్లల వైద్యుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఐఎంఏ భవనంలో నర్సింగ్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అజ్జ శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ నేతి బాలేష్, ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీశైలం మాట్లాడుతూ పుట్టిన వెంటనే నవజాత శిశువుకు అందించే ప్రాథమిక చికిత్స గురించి వివరించారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ దామోదర్ రావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీశైలం, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్షల భయంతో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

బాన్సువాడ రూరల్: బాన్సువాడ మండలంలోని బోర్లం క్యాంపులో గల సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థి ఆత్మహత్యకు యత్నించింది. వార్షిక పరీక్షలు సమీపించడంతో ఫెయిల్ అవుతానేమోనన్న భయంతో ఆదివా రం పాఠశాల భవనంపై నుంచి దూకింది. గమనించిన ఉపాధ్యాయులు, సిబ్బంది వెంటనే బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స అందించారు. కుడి భుజం ఎముక విరిగినట్లు గుర్తించిన వైద్యులు.. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ పద్మకుమారి వివరణ కోరగా విద్యార్థిని నెలరోజుల నుంచి పాఠశాలకు రావడం లేదన్నారు. శనివారమే వచ్చిందని, పరీక్షలంటే భయంతో ఇలా చేసినట్లు విద్యార్థిని చెప్పిందన్నారు.

నామినేటెడ్ జోష్

- ఉమ్మడి జిల్లాలో నలుగురు కాంగ్రెస్ నేతలకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు
- ఎన్నికల నగారా మోగిన రోజే నియామకం
- బాల్కొండ నియోజకవర్గం నుంచే ముగ్గురికి అవకాశం
- బాన్సువాడ నుంచి ఒకరికి..



అన్వేష్‌రెడ్డి



ఈరవత్రి అనిల్



మానాల మోహన్‌రెడ్డి



కాసుల బాల్‌రాజ్



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పార్లమెంట్ ఎన్నికల నగారా మోగిన రోజే ఉమ్మడి జిల్లాకు చెందిన నలుగురు కాంగ్రెస్ నాయకులకు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులు దక్కాయి. దీంతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ పెరిగింది. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డికి తెలంగాణ కో–ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్, మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్‌కు తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెట అన్వేష్‌రెడ్డికి తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ పదవుల్లో నియమితులయ్యారు. వీరు ముగ్గురూ బాల్కొండ నియోజకవర్గానికి చెందినవారే కావడం విశేషం. వీళ్లతో పాటు బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన కాసుల బాలరాజుకు తెలంగాణ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవి లభించింది. అయితే తాజాగా ఈ నలుగురికి పదవులు దక్కినప్పటికీ ఇంతకు కొద్దిరోజుల ముందే అర్బన్ నియోజకవర్గానికి చెందిన తాహెర్‌బిన్ హందాన్‌కు రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ పదవిని ప్రభుత్వం కేటాయించింది. ఇదిలా ఉండగా జిల్లాకు చెందిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయిన బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు పార్టీ నాయకత్వం శాసనమండలి సభ్యుడిగా అవకాశం కల్పించింది. మరోవైపు నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం నుంచి పోటీచేసి ఓటమి చెందిన షబ్బీర్ అలీకి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పదవి దక్కింది. ఒక ఎమ్మెల్సీ, ప్రభుత్వ సలహాదారు, ఐదు రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులు కలిపి మొత్తంగా ఏడు పదవులు ఉమ్మడి జిల్లా నాయకులకు దక్కడం విశేషం. ప్రస్తుతం రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులు 98 వరకు ఉన్నాయి.

ఎదురుచూస్తున్న మరికొందరు నాయకులు..

నామినేటెడ్ పదవుల కోసం జిల్లా నుంచి పలువురు సీనియర్ నాయకులు తమవంతుగా గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం కొందరికి పదవులు వచ్చినప్పటికీ ఇంకా మరికొందరు నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. ఆది నుంచి కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్న సీనియర్ నాయకులైన పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్, నిజామాబాద్ నగర అధ్యక్షుడు కేశ వేణు, పీసీసీ ప్రధాన కార్యదర్శులు గడుగు గంగాధర్, నగేశ్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, మాజీ మేయర్ ధర్మపురి సంజయ్, పీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్‌యాదవ్, మైనారిటీ నాయకుడు సయ్యద్ ఖైసర్, అంతిరెడ్డి రాజిరెడ్డి, గడ్కోల్ భాస్కర్‌రెడ్డి నామినేటెడ్ పదవుల కోసం గట్టి ప్రయత్నాలు చేస్తూ వస్తున్నారు. కాగా జిల్లాలో ముఖ్యమైన నామినేటెడ్ పదవులకు సంబంధించి నుడా చైర్మన్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పదవులు మాత్రమే భర్తీ చేయాల్సి ఉంది. అయితే ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఇంకా మరికొందరికి రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవులు దక్కనున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో లోక్‌సభ ఎన్నికల తర్వాతే మిగిలిన ఆశావహుల ఆశలు నెరవేరనున్నాయి.

నేటి నుంచి 'పది' పరీక్షలు



జిల్లా కేంద్రంలోని ఓ పరీక్ష కేంద్రంలో నంబర్లు వేస్తున్న సిబ్బంది

- ఏర్పాట్లు పూర్తిచేసిన విద్యాశాఖ అధికారులు
- జిల్లాలో 141 పరీక్షా కేంద్రాలు
- హాజరుకానున్న 22,281 మంది విద్యార్థులు

నిజామాబాద్‌అర్బన్: పదో తరగతి వార్షిక పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 30వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 141 సెంటర్లను ఏర్పాటు చేశారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగనున్నాయి. పరీక్షల నిర్వహణ కోసం ఇప్పటికే జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎలాంటి లోటుపాట్లు జరుగకుండా చర్యలు తీసుకున్నారు. ఈ సారి కొత్తగా పరీక్ష కేంద్రాలకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లుగా సీనియర్ ప్రధానోపాధ్యాయులను మాత్రమే కేటాయించారు. విద్యార్థులకు ఇబ్బందులు కాకుండా పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులను కల్పించారు.

పరీక్ష రాయనున్న 22,281 మంది..

జిల్లాలో పదో తరగతి పరీక్షలకు సంబంధించి 22,281 మంది పరీక్షలు రాయనున్నారు. ఇందులో 11,158 బాలురు, 10,735 మంది బాలికలు పరీక్షలకు హాజరు కానున్నారు. ప్రైవేటుగా 380 మంది పరీక్షలు రాయనున్నారు. ఈసారి నూతనంగా సైన్స్ సబ్జెక్టుకు సంబంధించి బయోలాజికల్, ఫిజికల్ సైన్స్ పరీక్షలు వేర్వేరుగా నిర్వహించనున్నారు. ఈ పరీక్షను ఉదయం 9:30 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు నిర్వహిస్తారు. హిందీ పరీక్ష మధ్యాహ్నం 12.50 గంటల వరకు జరగనుంది. పరీక్షలకు నిమిషం నిబంధన అమలు చేయడంలేదు.

సెల్‌ఫోన్లు నిషేధం

పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా సెంటర్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాకుండా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. కేంద్రాల చుట్టుపక్కల గల జిరాక్స్ సెంటర్లను మూసివేయించనున్నారు. సెంటర్లలోకి ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్‌ఫోన్లు నిషేధించారు. పరీక్ష కేంద్రాల్లోకి వచ్చే విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీలు చేయనున్నారు. పరీక్ష నిర్వహణలో 141 చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఏడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 141 సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించారు. పరీక్షలకు సంబంధించి ఏవైనా సందేహాలుంటే 9030282993 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



పదో తరగతి పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తాం. ఎలాంటి లోటుపాట్లు ఉండవు. మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా చర్యలు తీసుకున్నాం. సెల్‌ఫోన్‌లు పూర్తిగా నిషేధించాం.

– దుర్గాప్రసాద్, డీఈవో

చరిత్రహీనులుగా చిత్రీకరించే ప్రయత్నాలను తిప్పికొట్టాలి



చరిత్రకు ఎర్రతెగులు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సారంగపాణి, విజయ సారథి తదితరులు

- కృష్ణా యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యుడు సారంగపాణి
- చరిత్రకు ఎర్రతెగులు పుస్తకావిష్కరణ

నిజామాబాద్ సిటీ: ఎంతో చరిత్ర కలిగిన భారతదేశంలో రాజులు, చక్రవర్తులు, భారతీయులను చరిత్రహీనులుగా చిత్రీకరించే ప్రయత్నాలను తిప్పికొట్టాలని విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ బొమ్మరాజు సారంగపాణి సూచించారు. ఆదివారం ఇతిహాస సంకలన సమితి(ఇందూరు) ఆధ్వర్యంలో 'భారత దేశ చరిత్రలో వక్రీకరణలు– వాస్తవాలు' అనే అంశంపై ఉపన్యాస కార్యక్రమం, చరిత్రకు ఎర్రతెగులు పుస్తకావిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్ర భారత చరిత్రలో పాఠ్యపుస్తకాల నుంచి మొదలుకొని పత్రికలు, ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా కొందరు కుహనా లౌకిక మేధావులు విదేశీ విభజన భావజాలంతో అద్వితీయమైన భారతీయ వాస్తవ చరిత్రను మరుగున పడవేసే ప్రయత్నం చేశారన్నారు. ఎందరో మహనీయుల జీవిత చరిత్రలను అణగదొక్కే ప్రయత్నం జరిగిందన్నారు. విదేశీ విధ్వంసక చక్రవర్తులను మహోన్నతులుగా చిత్రీకరించే ప్రయత్నాలు ఇప్పటికీ చేస్తున్నారన్నారు. భారతీయులందరూ వాస్తవంతో కూడిన భారత చరిత్రను అధ్యయనం చేయాలని సూచించారు. జాగృతి వారపత్రిక పూర్వ సంపాదకులు డాక్టర్ వడ్డీ విజయసారథి మాట్లాడుతూ కమ్యూనిస్టులు పథకం ప్రకారం భారతీయుల మెదళ్లలోకి విదేశీ విషాన్ని నింపుతూ వచ్చారని పేర్కొన్నారు. చరిత్రకు ఎర్రతెగులు పుస్తకం ప్రతి భారతీయుడు చదవాలని సూచించారు. ప్రముఖ రచయిత్రి పీఎస్ఎం లక్ష్మి మాట్లాడుతూ ఇందూరు ఎంతో ఆధ్యాత్మిక వైభవం కలిగిన జిల్లా అని పేర్కొన్నారు. కార్యక్రమంలో చరిత్ర పరిశోధకులు కందకుర్తి యాదవరావు, ఇతిహాస సంకలన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కందకుర్తి ఆనంద్, ప్రతినిధులు రాంపల్లి మల్లికార్జున్, చిలుముల మోహన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

పంటనష్టం.. 6,058 ఎకరాలు

- వడగళ్లకు భారీగా దెబ్బతిన్న వరి
- 44 గ్రామాల్లో 3,076 మంది రైతులకు నష్టం
- అంచనా నివేదికను ప్రభుత్వానికి పంపిన వ్యవసాయ శాఖ



ఎడపల్లి మండలం రాణాకలాన్‌లో నేలకొరిగిన మక్కను పరిశీలిస్తున్న డీఏవో వాజిద్ హుస్సేన్

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో శనివారం కురిసిన వడగళ్ల వర్షం ధాటికి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. జిల్లా వ్యాప్తంగా పది మండలాల్లోని 44 గ్రామాలు కలిపి 6,058 ఎకరాల్లో వివిధ పంటలు నష్టపోయాయి. మొత్తం 3,076 మందికి రైతులకు పంట చేతికి రాకుండా పోయింది. అత్యధికంగా వరికి 5,661 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. కోతకు వచ్చిన వడ్లు పొలాల్లోనే రాలిపోయాయి. కొన్ని చోట్ల 40 శాతం పంట కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. చాలా ప్రాంతాల్లో వరిపైరు నేలకొరిగింది. దీంతో పంట కోతకు ఇబ్బంది కానుంది. ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వానకు బోధన్, సాలూర, ఎడపల్లి, ధర్పల్లి, డిచ్‌పల్లి, ఇందల్వాయి, నిజామాబాద్ రూరల్, సిరికొండ, మెండోరా, వర్ని మండలాల్లోని గ్రామాలు ప్రభావితమయ్యాయి. ప్రధానంగా ఇందల్వాయి మండలంలో 2,360 ఎకరాల వరి చేతికి రాని పరిస్థితి నెలకొంది. నల్లవెల్లిలో అధిక నష్టం జరగడంతో అక్కడి రైతులు లబోదిబోమంటున్నారు. సిరికొండ మండలంలో కూడా 1,500 ఎకరాల్లో వరి దెబ్బతిన్నది. ఎడపల్లిలో 930 ఎకరాల్లో నష్ట జరిగింది. అదే విధంగా పొలాల్లో ఉన్న మొక్కజొన్న నేలకొరగగా, కల్లాలు, రోడ్లపై ఆరబోసిన ఉన్న మక్కలు, జొన్నలు, పసుపు తడిశాయి. ఎదిగి పూతదశకు వచ్చిన నువ్వు పంట నేలవాలింది. తడిసిన పంటలను ఆరబెట్టేందుకు రైతులు శ్రమించాల్సి వచ్చింది. మామిడి తోటల్లో కూడా పిందెలు నేలరాలాయి. అయితే, వ్యవసాయాధికారులు పంట నష్టం వాటిల్లిన ప్రాంతాల్లో పర్యటించి రైతుల నుంచి వివరాలను సేకరించారు. అంచనా నివేదికను కలెక్టర్ అనుమతితో ప్రభుత్వానికి పంపినట్లు జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ 'సాక్షి'కి తెలిపారు. చేతికొచ్చిన పంటలను నష్టపోయిన తమకు పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పంటల వారీగా జరిగిన నష్టం

పంట	ఎకరాలు
వరి	5,661
మక్క	292
జొన్న	93
నువ్వు	12

నేటి నుంచి అంగన్‌వాడీలలో ఒంటిపూట..

నిజామాబాద్‌నాగారం: వేసవి నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలను ఒంటిపూట నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లాలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు అన్ని సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నారు. నేటి నుంచి మే 31 వరకు ఒంటిపూట నడవనున్నాయి.

జిల్లాలో 1500 కేంద్రాలు

జిల్లాలో మొత్తం 1500 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిల్లో చిన్నారులు 80,747, గర్భిణులు 1,134, బాలింతలు 10,260 మంది ఉన్నారు. వీరికి పాలు, గుడ్లు పౌష్టికాహారాన్ని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల ద్వారా అందిస్తున్నారు. ప్రతినిత్యం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల స్కూల్ నిర్వహణతో పాటు, లబ్ధిదారులకు ఆహార పంపిణీ పూర్తి చేయనున్నారు.

ఆదేశాలు వచ్చాయి

అంగన్‌వాడీ కేంద్రాలను ఒంటి పూట నిర్వహించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కేంద్రాలను నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చాం. పిల్లలకు, గర్భిణులు బాలింతలకు ఆహారాన్ని తప్పనిసరిగా అందించాల్సిందే. నేటి నుంచి మే 31 వరకు ఒంటిపూట కొనసాగనున్నాయి.

– రసూల్‌బీ, పీడీ, ఐసీడీఎస్

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ

- ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసేందుకు చర్యలు
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన సందర్భంగా ఆదివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్, సీపీ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని, జూన్ 6 వరకు ఉంటుందని తెలిపారు. నోటిఫికేషన్ ఏప్రిల్ 18న వస్తుందని, ఏప్రిల్ 25 తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, 26న స్క్రూటినీ, 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందని పేర్కొన్నారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ చేపడతామని పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు సీఎంసీ కళాశాలలో కొనసాగుతుందని వివరించారు. నిజామాబాద్ ఎంపీ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలైన ఓట్లన్నీ ఒకేచోట కౌంటింగ్ జరుపుతామని, ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించరాదని సూచించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు ఎంసీఎంసీ, సర్వేలెన్స్ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, వీడి యో సర్వేలెన్సు బృందాలను, ఇతర కమిటీలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ప్రవర్తన నియమావళి ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. కోడ్ ఉల్లంఘనపై ప్రజలు నేరుగా 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని, అలాగే సీ–విజిల్ యాప్‌ను కూడా ఎన్నికల సంఘం అందుబాటులో ఉంచిందన్నారు. కోడ్ అమలు తీరు పర్యవేక్షణకు జిల్లాస్థాయిలో ఇంటెలిజెన్స్ కమిటీని నెలకొల్పామని తెలిపారు. ఎన్నికల విధుల్లో సుమారు 8వేల మంది సిబ్బంది పాల్గొంటారన్నారు. సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో అదనపు పోలీసు బలగాలతో పాటు, ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ఎన్నికల్లో ప్రలోభాలకు ఆస్కారం లేకుండా ఉండేందుకు జిల్లాలో 18 చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వీటిలో అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో నాలు గు ఉమ్మడి తనిఖీ కేంద్రాలు ఉండగా, జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో ఆరు చెక్ పోస్టులు, జిల్లాలోనే స్థానికంగా మరో ఎనిమిది తనిఖీ కేంద్రాలు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తాయన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రెయినీ ఐఏఎస్ కిరణ్మయి, ట్రెయినీ ఐపీఎస్ చైతన్యరెడ్డి, అదనపు డీసీపీ కోటేశ్వర్ రావు పాల్గొన్నారు.

సభలకు ముందస్తు అనుమతి తీసుకోవాలి

ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు, ఇతర కార్యక్రమాల కోసం ముందస్తు అనుమతి పొందాల్సి ఉంటుందని కలెక్టర్, సీపీ సూచించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్, సీపీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగేలా రాజకీయ పార్టీల తరపున కృషి చేయాలని కోరారు. సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులు అందిస్తామని, కనీసం 48 గంటల ముందు సువిధ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎవరు ముందు దరఖాస్తు చేసుకుంటే వారికి అనుమతి ఉంటుందని, రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించడానికి వీలులేదన్నారు. మతం, కులం, ప్రాంతీయ అంశాలను ప్రస్తావిస్తూ విద్వేషాలు చెలరేగేలా వ్యాఖ్యలు చేయడం నిషేధమని, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, బెదిరింపులకు పాల్పడడం, తప్పుడు ప్రచారాలు చేయడంపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.

గల్ఫ్ మృతులకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా

- తొలిసారిగా సాయం ప్రకటించిన రేవంత్ సర్కారు
- అందరికీ కాకుండా.. ఇద్దరి కోసమే ప్రత్యేక జీవో జారీ
- శాశ్వత ప్రాతిపదికన ఉత్తర్వులను జారీచేయాలని విన్నపం



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన గల్ఫ్ వలస కార్మికుల సంఘం ప్రతినిధులు(ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): గల్ఫ్ వలస కార్మికులకు స్వల్ప ఊరటనిస్తూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రేవంత్‌రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత సౌదీ అరేబియా, బహ్రెయిన్‌లలో మరణించిన ఇద్దరు వలస కార్మికుల కుటుంబాలకు సాయం ప్రకటించారు. రూ.5 లక్షల చొప్పున ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పరిహారం మంజూరు చేస్తూ గత శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ రెండు ఉత్తర్వులను జారీ చేశారు. గల్ఫ్ దేశాల్లో ఏ కారణంతోనైనా మరణించిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.5 లక్షల సాయం అందిస్తామని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలోనే ప్రకటించింది. గల్ఫ్ మృతుల కుటుంబాలకు సాయం అందించడానికి శాశ్వత ప్రాతిపదికన ఉత్తర్వులను జారీ చేయకుండా రెండు ప్రత్యేక జీవోల ద్వారానే సాయం ప్రకటించడంపై గల్ఫ్ వలస కార్మికులు పెదవి విరుస్తున్నారు. సౌదీ అరేబియాలో వేములవాడ మండలం మర్రిపెల్లికి చెందిన శశికుమార్ 2023 డిసెంబర్ 19న మరణించాడు. బహ్రెయిన్‌లో వేములవాడ నియోజకవర్గ పరిధిలోని కోనరావుపేట మండలం బాసాయిపేట్‌కు చెందిన బొడ్డు బాబు ఇసుకదిబ్బల్లో పడి మరణించాడు. ఇతను 2023 డిసెంబర్ 7న ప్రమాదవశాత్తు మృత్యువాత పడ్డాడు. ఈ ఇద్దరి కుటుంబాలకు ఆర్థిక చేయూతను అందించాలని ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. స్పందించిన సీఎం ఆదేశించడంతో ఆర్థిక సహాయాన్ని అధికారులు మంజూరు చేశారు. ఈ ఉత్తర్వుల స్థానంలో శాశ్వత ప్రాతిపదికన మేలు జరిగే జీవో జారీచేసి ఉంటే ఎన్నో గల్ఫ్ మృతుల కుటుంబాలకు మేలు జరిగేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రభుత్వం ఏర్పడక ముందు మరణించిన వారికి..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత డిసెంబర్‌లో ఏర్పడింది. అంతకు ముందు గల్ఫ్ దేశాల్లో వివిధ కారణాల వల్ల తెలంగాణ వలస కార్మికులు దాదాపు రెండు వేల మంది మరణించారని అంచనా. ఇప్పుడు సాయం మంజూరు చేసిన విధంగానే గతంలో మరణించిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా మంజూరు చేస్తారా లేదా అనే విషయంలో కొంత గందరగోళం నెలకొంది. ఇదిలా ఉండగా తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పడిన ఘటనల వల్ల మరణించినవారి కుటుంబాలకే సాయం అందించాలని నిర్ణయిస్తే ఇందుకోసం జీవో జారీ చేయాల్సి ఉంది. గతంలో మరణించిన వారి కుటుంబాలకు ఎంతో కొంత పరిహారాన్ని అందిస్తే ఎంతో మేలు చేసినట్లు అవుతుందని వలస కార్మికుల సంఘాల నాయకులు చెబుతున్నారు. ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన చేసి గల్ఫ్ మృతుల కుటుంబాలను మానవతా దృక్పథంతో ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

హోమియో వైద్యుడు వెంకట్‌రెడ్డికి సన్మానం



నిజామాబాద్ సిటీ: ప్రభుత్వ హోమియో వైద్యుడిగా సుదీర్ఘకాలం పనిచేసి ఇటీవల పదవీ విరమణ పొందిన వెంకట్‌రెడ్డిని పీవైఎల్ నగర కమిటీ నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నగరంలోని హరిత నగర్ ఆకుల హన్మంత్ మహిళా భవన్‌లో ఆకుల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. స్థానికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్, మాజీ అధ్యక్షుడు రమేశ్, ఐఎఫ్‌టీయూ నాయకుడు రవి, నాయకులు ఆకుల పాపయ్య, మాజీ కార్పొరేటర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

బస్‌పాస్ తప్పనిసరి

ఖలీల్‌వాడి: మహాలక్ష్మి పథకం ద్వారా ఉమ్మడి జిల్లాలోని పదో తరగతి బాలికలు పరీక్షాకేంద్రం వరకు ఉచితంగా ప్రయాణించవచ్చని ఆర్టీసీ ఆర్‌ఎం జానీరెడ్డి తెలిపారు. పాఠశాలల వరకు వెళ్లేందుకు తీసుకున్న బస్‌పాస్‌లతో బాలురు పరీక్షాకేంద్రాలకు కూడా వెళ్లే అవకాశం ఉంటుందని, పాస్‌లు లేనివారు తప్పనిసరిగా టిక్కెట్ తీసుకోవాలని స్పష్టం చేశారు. సోషల్‌మీడియాలో వస్తున్న వదంతులను నమ్మొద్దని సూచించారు.

వైభవంగా వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

బాన్సువాడ : బీర్కూర్ మండలం తిమ్మాపూర్‌లో వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. నవమి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని ఆదివారం శ్రీ లక్ష్మి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. పోచారం కుటుంబ సభ్యులు స్వామి కళ్యాణానికి హాజరయ్యారు.

ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలి

కామారెడ్డి క్రైం: ఓటింగ్ శాతం పెరగడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు కృషి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో ఆదివారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయడానికి ఓటర్లు 12 రకాల కార్డులలో దేనినైనా ఉపయోగించుకోవచ్చని సూచించారు. విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేయవద్దన్నారు. సభలు, సమావేశాలు, లౌడ్ స్పీకర్లకు తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

తడిసి ముద్దయిన పసుపు



బాల్కొండ: అకాల వర్షం కారణంగా రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. ప్రస్తుతం రైతులు పసుపు ఉడకబెట్టి కల్లాల్లో బోశారు. అయితే, కల్లాల్లో ఆరబోసిన పసుపు అకాల వర్షం కారణంగా తడిసి ముద్దయ్యింది. పసుపు తడిసి చందూరు ఏర్పడుతుందని, వ్యాపారులు సగం ధరకు కూడా కొనుగోలుచేయరని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొన్ని గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో కారణంగా నువ్వు నేలకొరిగింది. ఇలాగే అకాల వర్షాలు కురిస్తే తమ పరిస్థి తి ఏమిటని ఆందోళన చెందుతున్నారు.

పంట బీమా అమలు చేస్తాం

- రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి
- దెబ్బతిన్న పంటల పరిశీలన



సాలూర మండలం కొప్పర్తి క్యాంప్‌లో మొక్కజొన్నను పరిశీలిస్తున్న సుదర్శన్‌రెడ్డి

బోధన్ రూరల్/ఎడపల్లి: అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు పంట బీమా వర్తింపజేస్తామని, రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. బోధన్, సాలూర, ఎడపల్లి మండలాల్లో అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను సుదర్శన్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. పంట నష్టం వివరాలను సేకరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాంసాగర్ పరిధిలోని రైతులు ముందుగానే వరి వేయడంతో ప్రస్తుతం కోత దశకు వచ్చిందని, అకాల వర్షం కారణంగా దెబ్బతిన్నదని అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పంటబీమా పథకాన్ని తీసేసి రైతులకు అన్యాయం చేసిందన్నారు. ప్రస్తు తం దెబ్బతిన్న పంట నష్టం వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు పరిహారం అందేలా కృషి చేస్తామన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనవెంట డీసీసీఅధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బీన్ హందాన్, టీపీసీసీ డెలిగేట్, మాజీ ఎంపీపీ గంగాశంకర్, కౌన్సిలర్ తూము శరత్‌రెడ్డి, నాయకులు మందర్న రవి, అల్లె రమేశ్, ఎడపల్లి మండల కాంగ్రెస్ అధ్య క్షుడు పులి శ్రీనివాస్, నాయకులు రామ్మోహన్, ఎల్లయ్య యాదవ్, నారాయణ చౌదరి, సూరిబాబు, కామప్ప, విజయ్ కుమార్, సరి దాస్ తదితరులున్నారు.

రాలిన మామిడి కాయలు



మాక్లూర్‌లో రాలిన మామిడి కాయలు

మాక్లూర్: ఈదురు గాలుల కారణంగా మండలంలో మామిడికి నష్టం వాటిల్లింది. కాయలు రాలిపోవడంతో రైతులు నష్టపోయారు. పిందె దశలో ఉన్న కాయలు రాలిపోయాయని, వాటిని విక్రయించే అవకాశం కూడా లేదని మాక్లూర్‌కు చెందిన రైతు లక్ష్మణ్ వాపోయాడు. మండలంలోని మదన్‌పల్లి, అమ్రాద్, రాంచంద్రపల్లి, గుత్ప, కల్లెడి, మాక్లూర్, మానిక్‌బండార్ తండాల్లో ఈదరుగాలులతో కూడిన వర్షం కురిసింది. పంటకు నష్టం వాటిల్లలేదని వ్యవసాయ అధికారిణి పద్మ తెలిపారు.

నేలకొరిగిన పంటలు

బోధన్/రుద్రూర్/వర్ని: బోధన్ నియోజకవర్గం పరిధిలో యాసంగి సీజన్‌లో అత్యధిక విస్తీర్ణంలో వరి సాగుకాగా, మొక్కజొన్న ఇతర ఆరుతడి పంటలను సాగు చేశారు. మరో 20 రోజుల్లో పంట కోతకు వచ్చే దశలో అకాల వర్షం రైతులను ఆగం చేసింది. 230 ఎకరాల్లో మొక్కజొన్న, 936 ఎకరాల్లో వరికి నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. బోధన్, సాలూర మండలంలోని నాగన్‌పల్లి, సాలూర క్యాంప్, కొప్పర్తి క్యాంప్ గ్రామాల్లో వరి, మొక్కజొన్నపంటలు నేలకొరిగాయి. కోటగిరి, పోతంగల్ మండలాల్లో దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో శాఖ సిబ్బంది పరిశీలించారు. పోతంగల్ మండలంలో 80 ఎకరాల వరి, కోటగిరి మండలంలో 120 ఎకరాల్లో వరి నేలకొరిగి పాక్షికంగా దెబ్బతిన్నట్లు గుర్తించారు. ఉమ్మడి వర్ని మండలంలో వరి, మొక్కజొన్నకు నష్టం వాటిల్లింది. వర్ని, జాకోర, జలాల్‌పూర్, సైదిమల్, సిద్దాపూర్, సైదిపూర్ శివార్లలో సుమారు 150 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అధికారి నగేశ్‌రెడ్డి వెల్లడించారు. 100 ఎకరాల మొక్కజొన్న పంట అకాల వర్షానికి నేలకొరిగిందని, వర్ని, సత్యనారాయణపురం గ్రామ శివార్లలో వరికి తాత్కాలికంగా నష్టం వాటిల్లిందని తెలిపారు. పంట నష్టం వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని ఏఈఓ నగేశ్‌రెడ్డి అన్నారు.



సాలూర క్యాంప్ శివారులో నేలకొరిగిన మొక్కజొన్న

‘రూరల్’లో 4వేల ఎకరాల్లో నష్టం

డిచ్‌పల్లి: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని డిచ్‌పల్లి, ఇందల్వాయి, సిరికొండ మండలాల్లో పంటలు నేలకొరిగాయి. మూడు మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. మరో వారంపది రోజుల్లో చేతికొస్తుందనుకున్న పంట నేలపాలైంది. డిచ్‌పల్లి మండలం యానంపల్లి, సుద్దులం, కొరట్‌పల్లి, రాంపూర్ గ్రామాల్లో వడగండ్ల వానతో పంటకు నష్టం వాటిల్లింది. జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ మండల వ్యవసాయాధికారి రాంబాబుతో కలిసి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. మండలంలో 550 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇందల్వాయి మండలంలోని నల్లవెల్లి, డొంకల్ గ్రామాల్లో సుమారు 2వేల ఎకరాల్లో వరి, నువ్వు, టమాట పంటతో పాటు కొత్తిమీరకు తీవ్ర నష్టం వాటిల్లింది. సిరికొండ మండలంలోని పెద్దవాల్గోట్, మైలారం, పందిమడుగు, చీమన్‌పల్లి, తాటిపల్లిలో సుమారు 1,552 ఎకరాల విస్తీర్ణంలో పంటలకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. డిచ్‌పల్లి సొసైటీ చైర్మన్ రాంచందర్‌గౌడ్, నాయకులు, రైతులు తదితరులువారివెంట ఉన్నారు. రైతులు ఆందోళన చెందొద్దని, నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి హామీ ఇచ్చారు.



డిచ్‌పల్లి మండలం కొరట్‌పల్లి శివారులో నేలకొరిగిన వరి

ఘనంగా భక్తిమాలిక పుస్తకావిష్కరణ



నిజామాబాద్ సిటీ: పద్య భారతి ఇందూరు సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ సైన్స్ పద్య కవి తంగుడిగె శ్రీనివాస్ రచించిన ‘భక్తిమాలిక’ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం నగరంలోని వినాయక్‌నగర్ దత్తాత్రమంలో నిర్వహించారు. ఈ పుస్తకావిష్కరణ సభకు ప్రముఖ కవి కాసర్ల నరేశ్ రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కాసర్ల మాట్లాడుతూ.. బాలల కోసం ఇదివరకే బాలసైన్స్ వినోదిని, మూలకాల పెట్టె అనే పుస్తకాలను రచించిన తంగుడిగె శ్రీనివాస్ రావు ప్రస్తుతం భక్తి మాలిక అనే పద్యాల పుస్తకాన్ని తీసుకురావడం శుభపరిణామన్నారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ గణపతి అశోక శర్మ మాట్లాడుతూ.. ఈ పుస్తకంలోని పద్యాలలో తొమ్మిది మంది దేవతల స్తుతులు కొలువుదీరినాయన్నారు. తల్లావజుల మహేశ్ బాబు, ప్రముఖ పద్యకవి, అష్టావధాని డాక్టర్ ఓంప్రకాశ్ బోచ్కర్, గౌరవ అతిథి రామ్మోహన్, కాసర్ల కరుణాకర్, ఇప్పకాయల సుదర్శన్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. పుస్తక సమీక్షను చక్కగా నిర్వహించిన చిల్క అరుంధతిని అభినందించారు. కవిదంపతులు అపర్ణ, శ్రీనివాస్, కవి మాతృమూర్తి తంగుడిగె గంగాదేవిలను పద్య భారతి సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు. కవులు శ్రీమాన్ నారాయణాచారి(విరాట్), చింతల శ్రీనివాస్ గుప్త, డా.అన్నందాస్ జ్యోతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్‌లు, ఏటీఎంలే టార్గెట్

- జిల్లాలో చోరుల అలజడి
- అంతర్‌రాష్ట్ర ముఠాపనేనా?

ఖలీల్‌వాడి: దొంగలు బ్యాంక్‌లు, ఏటీఎంలను టార్గెట్ చేస్తున్నారు. ప్రధాన రోడ్ల పక్కనే ఉన్న ఏటీఎంలలో చోరీకి యత్నిస్తున్నారు. ఏటీఎంలను దోచుకునేందుకు వస్తున్న దుండగులు సీసీ ఫుటేజీ లభించకుండా జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు అలారం మోగకుండా వైర్లను కత్తిరిస్తున్నారు. జిల్లాలో గడిచిన 15 రోజుల్లో ఒక ఏటీఎంలో చోరీ చేయగా, మరో ఏటీఎంలో చోరీకి యత్నించారు. పిప్రిలో గ్రామీణ బ్యాంక్‌లో చోరీకి యత్నించగా అలారం మోగింది.

ముందుగా రెక్కీ నిర్వహించి..

ఏటీఎం, బ్యాంకుల్లో చోరీకి యత్నిస్తున్న దుండగులు ముందుగా రెక్కీ నిర్వహిస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు రోడ్లపై ప్రజల రాకపోకలు, పోలీసుల పెట్రోలింగ్ సమాచారాన్ని సేకరించిన తరువాతే దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలినట్లు సమాచారం. అర్ధరాత్రి సమయంలోనే ఏటీఎం, బ్యాంక్‌లలో చోరీకి యత్నిస్తున్నారు. చోరీలకు పాల్పడుతున్నది అంతర్‌రాష్ట్ర ముఠాగానే పోలీసులు భావిస్తున్నారు.

రికవరీలో లేని పురోగతి

జూన్, 2022లో మెండోరా తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో దొంగతనం జరిగి రెండు ఏండ్లు కావస్తున్న ఇప్పటికీ వరకు బంగారం రికవరీ పూర్తి స్థాయిలో జరగలేదు. ఈ బ్యాంక్ దొంగతనంలో రూ.4.40 కోట్ల విలువైన బంగారం దోపిడికి పాల్పడగా ముగ్గురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.8.50 లక్షలు రికవరీ చేశారు. మిగితా నిందితులు ఇంత వరకు దొరకలేదు.



రుద్రూర్‌లో దొంగలు ధ్వంసం చేసి రోడ్డుపక్కన పారేసిన ఏటీఎం భాగాలు (ఫైల్)

దొంగిలించిన కార్లలో..

ఏటీఎం, బ్యాంక్‌లలో చోరీకి యత్నిస్తున్నవారు దొంగిలించిన కార్లలో వస్తున్నారు. మెండోరా బ్యాంక్‌లో చోరీ సమయంలో ఉపయోగించిన కారు సైతం దొంగిలించినదే. ఇటీవల రుద్రూర్ ఏటీఎంలో చోరీకి పాల్పడిన దుండగులు కారును మహారాష్ట్రలో కారును వదిలేసి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు.

- ■ ఈనెల 14న రుద్రూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ దగ్గరలో ఉన్న ఎస్బీఐ ఏటీఎంను ధ్వంసం చేసిన దుండగులు రూ.20లక్షలు ఎత్తుకెళ్లారు. కేవలం పది నిమిషాల్లోనే తమ పని పూర్తి చేశారు. ఆధారాలు లభించకుండా సీసీ కెమెరాలపై నల్లరంగు స్ప్రే చేశారు.
- ■ ఈనెల 10న ఆర్మూర్ రూరల్ మండలం పిప్రిలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో చోరీకి ప్రయత్నించారు. అలారం మోగడంతో పరారయ్యారు.
- ■ 15 రోజుల క్రితం నవీపేట్ మండల కేంద్రంలోని ఎస్బీఐ ఏటీఎంలో చోరీకి యత్నించారు. ఆలారం మోగడంతో పరారయ్యారు.
- ■ నాలుగు నెలల క్రితం ఆర్మూర్ పట్టణంలో కారులో నుంచి కిలో బంగారాన్ని దొంగలు ఎత్తుకెళ్లారు. ఇప్పటి వరకు బంగారం రికవరీ కాలేదు.



ముగ్గురు మహిళల అదృశ్యం

- కుటుంబ కలహాల కారణంగా ఇద్దరు..
- స్నేహితురాలి ఇంటికి వెళ్లి మరొకరు..
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధిత కుటుంబాల సభ్యులు
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రం నుంచి ఇద్దరు మహిళలు అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. అశోక్‌నగర్ కాలనీకి చెందిన కాలనీకి చెందిన లక్ష్మీదేవికి ఆమె భర్తతో వారం రోజులుగా గొడవ జరుగుతుండడంతో ఆదివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో కుమార్తె అంజలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

స్నేహితురాలి ఇంటికి వెళ్లి..

నిజామాబాద్‌లోని గంగస్థాన్ ఫేజ్–2కు చెందిన నార్లవారి అశ్విని, ఆమె భర్త విజయ్‌కుమార్ కొంత కాలంగా హైదరాబాద్‌లోని పీర్జాదిగూడలో నివాసం ఉంటున్నారు. వారిద్దరూ గత బుధవారం కామారెడ్డికి వచ్చారు. కొత్త బస్టాండ్‌లో దిగిన తర్వాత అశోక్‌నగర్ కాలనీలో ఉండే తన స్నేహితురాలు అనురాధతో కలిసి వాళ్ల ఇంటికి వెళ్తానని చెప్పి అశ్విని వెళ్లగా, విజయ్‌కుమార్ నిజామాబాద్ వెళ్లిపోయాడు. తర్వాత ఎన్నిసార్లు ఫోన్ చేసినా కలవలేదు. అశోక్‌నగర్‌కు వచ్చి చూడగా ఇంటికి తాళం వేసి ఉంది. చాలాచోట్ల గాలించినా ఆచూకీ దొరకలేదు. దీంతో విజయ్‌కుమార్ ఆదివారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

రామేశ్వర్‌పల్లికి చెందిన మహిళ..

రామేశ్వర్‌పల్లికి చెందిన గంగని అనిత అదృశ్యమైనట్లు ఎస్సై రాజు తెలిపారు. అనిత పదేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన స్వామిని ప్రేమ వివాహం చేసుకుంది. ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవలు జరగడంతో ఈ నెల 16న సాయంత్రం ఆస్పత్రికి వెళ్ళి వస్తానని కుమార్తె సాగరికకు చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె సోదరుడు ఆనంద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



క్రైం కార్నర్

19న వాహనాల వేలం

భీమ్‌గల్ : ప్రొహిబిషన్, ఎక్సైజ్‌స్టేషన్ భీమ్‌గల్ పరిధిలో పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న రెండు ద్విచక్ర వాహనాలను బహిరంగ వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ వేణు మాధవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేదీన భీమ్‌గల్ ఎక్సైజ్ స్టేషన్‌లో ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం ప్రారంభమవుతుందని, ఆసక్తిగలవారు వేలంలో పాల్గొనాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

నవీపేట: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నవీపేటకు చెందిన కుమ్మరి రాములు(80) మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. రాములు బాసర రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో రాములు తలకు తీవ్రగాయం కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఘటనకు సంబంధించి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఆర్మూర్‌టౌన్: ఆలూర్ మండల కేంద్రంలోని తాళం వేసిన ఇంట్లో అర్ధ రాత్రి శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. 18వ నంబర్ వీధికి చెందిన శివ లింగం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల పెళ్లికి వెళ్లారు. దుండగులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని రెండున్నర తులాల బంగారం, రూ.10,500 నగదు, వెండి సామగ్రి, కొత్త చీరలను ఎత్తుకెళ్లారు. ఆధారాలు లభించకూడదనే ఉద్దేశంతో ఇంట్లో కారం చల్లి పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండల కేంద్రం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. అనుమతుల లేకుండా మంగ మల్లయ్య అనే వ్యక్తి తన ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. మల్లయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రివార్డ్ పాయింట్స్ పేరుతో సైబర్ మోసం

- బ్యాంక్ ఖాతా నుంచి రూ.25వేలు విత్‌డ్రా

బోధన్‌టౌన్(బోధన్): పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం సైబర్ క్రైం కేసు నమోదు చేసినట్లు సీఐ వీరయ్య తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని రాకాసీపేట్ కాలనీకి చెందిన షేక్ షెహబాజ్ మొబైల్‌కు యోనో ఎస్‌బీఐ రివార్డ్ పాయింట్స్ పేరుతో ఓ వచ్చింది. ఆ మెసెజ్‌లోని లింక్‌ను క్లిక్ చేసిన షెహబాజ్ బ్యాంక్ అకౌంట్ నంబర్, ఓటీపీ వివరాలు నమోదు చేశాడు. ఆ వెంటనే ఖాతా నుంచి రూ.25,501 విత్‌డ్రా చేసినట్లు మెసెజ్ రావడంతో బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఊర చెరువులో రెండు మృతదేహాలు

- మాచారెడ్డిలో కలకలం

మాచారెడ్డి: ప్రమాదవశాత్తు నీటమునిగి ఇద్దరు మృతి చెందగా, ఒకేరోజు చెరువులో రెండు మృతదేహాలు కనిపించడం మాచారెడ్డిలో కలకలం సృష్టించింది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని రత్నగిరిపల్లికి చెందిన దొంతరవేణి నర్సయ్య(35)ఈనెల 15న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. ఆదివారం ఉదయం ఊరచెరువులో నర్సయ్య మృతదేహం కనిపించింది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీయించారు. చెరువులో మరో మహిళ మృతదేహం ఉన్నట్లు ఆదివారం సాయంత్రం పోలీసులకు సమాచారం అందింది. మృతదేహాన్ని చెరువులో నుంచి బయటికి తీయించిన పోలీసులు.. మృతురాలు ఎల్లంపేటకు చెందిన మరాఠి లక్ష్మి(38) గా గుర్తించారు. లక్ష్మి కూడా 15వ తేదీన ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. వేర్వేరుగా ఇద్దరు బహిర్భూమికి వెళ్ళి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సాగర్ కాలువలో వృద్ధుడి మృతదేహం..

రుద్రూర్: కోటగిరి మండలం ఎక్లాస్‌పూర్ శివారులోని నిజాంసాగర్ కాలువలో వృద్ధుడి మృతదేహాన్ని గుర్తించారు. మృతుడిని కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం బస్వాయిపల్లికి చెందిన మొహమ్మద్ సయ్యద్ (83)గా గుర్తించినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జంటహత్యల కేసు నిందితుడి ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్: జంట హత్యల కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్మూర్ పట్టణంలో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామానికి చెందిన గంగాధర్ ఏడు నెలల క్రితం పట్టణంలోని జిరాయత్‌నగర్‌లో తన వియ్యపురాలితోపాటు ఆమె సోదరిని హత్య చేసి బంగారం ఎత్తుకెళ్లాడు. ఈ కేసులో గంగాధర్‌ను పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపగా, రెండు నెలల క్రితం బెయిల్‌పై బయటకు వచ్చాడు. అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న గంగాధర్ భార్యను తరచూ కొడుతుండడంతో ఆమె భర్తను వదిలివెళ్లిపోయింది. తనకు సంబంధించిన కేసులు, భూమి విషయమై న్యాయ సలహా కోసం ఆదివారం ఆర్మూర్‌కు వచ్చిన గంగాధర్ విద్యానగర్ కాలనీ పెట్రోల్‌పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్‌హెచ్‌వో రవికుమార్ ఘటనాస్థలానికి చేరుకొని విచారించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య బండి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

బెల్ట్‌షాపులపై కొరడా



కామారెడ్డి క్రైం/నాగిరెడ్డిపేట/నిజాంసాగర్/ఎల్లారెడ్డి/రాజంపేట/మద్నూర్: బెల్ట్‌షాపులపై పోలీసులు కొరడా ఝులిపించారు. కామారెడ్డి పట్టణంతోపాటు ఆయా మండలాల్లో ఆదివారం దాడులు చేసి మద్యం నిల్వలను సీజ్ చేశారు. కామారెడ్డిలోని ఇందిరానగర్ కాలనీలో బెల్ట్‌షాప్‌పై ఎస్సై ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి 29 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్ షాప్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి, అడ్లూర్, గర్గుల్ గ్రామాల్లో 45.50లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రామన్ తెలిపారు. దాడుల్లో ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు. నాగిరెడ్డిపేట మండలం చిన్న ఆత్మకూర్, తాండూర్ గ్రామాల్లో మద్యంబాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. మూడు దుకాణాల నుంచి 89బాటిళ్ల మద్యం, బీరును స్వాధీనం చేసుకున్నామన్నారు. మహమ్మద్‌నగర్ మండలం తుంకిపల్లిలో 33లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని బెల్ట్‌షాప్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. ఎల్లారెడ్డి మండలం శివానగర్, రుద్రారం, తిమ్మారెడ్డి గ్రామాల్లో బెల్ట్‌షాపులపై దాడి చేసి రూ.15వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు. రాజంపేట మండలం కొండాపూర్‌లో 9లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సంపత్ తెలిపారు. మద్నూర్ మండలం మేనూర్, మద్నూర్‌లోని బెల్ట్‌షాపులపై దాడి చేసినట్లు ఎస్సై కదిరె శ్రీకాంత్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ మీ బంగారం తాకట్టులో ఉందా. వడ్డీ కట్టలేకపోతున్నారా. ఎటువంటి ఫైనాన్స్‌లో ఉన్నా బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకే కొనబడును. ఫోన్: 9550606222. [H-787738]

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైమ్ మానుఫాక్చరింగ్ ప్యాకింగ్ వర్క్స్ ... ఫోన్: 90596 63584, 95026 15217. [M-1233093]

■ ... హైదరాబాద్ నందు ... 18k ఫోన్: 9160900024 / 9640400073. [H-799054]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/- రూ॥లు ప్రతి అదనపు లైను 50/- రూ॥లు మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరం ఇవ్వాలని మా పాఠకులకు మనవి. ప్రకటనదారులు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.